క్లుప్తంగా

అప్పన్న అన్నప్రసాదానికి రూ.లక్ష విరాళం



దాత శ్రీనివాసరావుకి బాండ్ అందజేస్తున్న సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి పాతగాజువాక సమీపంలోని పంతులు గారి మేడ ప్రాంతానికి చెందిన బి.శ్రీనివాసరావు లక్ష రూపాయల విరాళాన్ని ఆదివారం అందజేశారు. సింహగిరిపై పీఆర్వో కార్యాలయంలోని డొనేషన్ కౌంటరులో నగదు అందజేశారు. దేవస్థానం తరఫున దాతకు ప్రోటోకాల్ విభాగం సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ బాండ్ అందజేశారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

కిటకిటలాడిన వరాహ పుష్కరిణి

సింహాచలం : మహాలయ పక్ష అమావాస్యని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానంకి చెందిన వరాహ పుష్కరిణి (కోనేరు) వద్ద పెద్ద ఎత్తున పితృకర్మలు చేసేందుకు పలువురు తరలివచ్చారు. కోనేరులో తర్పణాలు వదిలారు. బ్రాహ్మణులకు స్వయం పాకాలు సమర్పించారు.


విశేషంగా అమావాస్య తిరువీధి



తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు, సిబ్బంది

సింహాచలం : అమావాస్యను పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి ఆదివారం సాయంత్రం విశేషంగా తిరువీధి నిర్వహించారు. స్వామి వారి ఉత్సవమూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను పల్లకిలో వేంజేపచేసి బేడామండపంలో తిరువీధి నిర్వహించారు. పెద్ద ఎత్తున హారతి అందజేశారు. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. ఉప ప్రధానార్చకుడు కె.కె. ప్రసాదాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ సత్య శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఆదిత్యునికి అభిషేకాలు



పూజలందుకున్న సూర్యనారాయణస్వామి

పెందుర్తి : సుజాత నగర్‌లోని సూర్య నారాయణస్వామి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామున స్వామి వారికి పంచ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు చేశారు. అలంకరణ చేసి ప్రత్యేక పూజలు జరిపారు. ఆదిత్యునికి పంచ హారతి, నక్షత్ర హారతి ఇచ్చారు. ఆలయ ధర్మకర్త చంద్ర శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదం అందించారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

పెందుర్తి : పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని జీవీఎంసీ 88వ వార్డు గవర జగ్గయ్యపాలెనికి చెందిన ఓ బాలిక అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. గ్రామంలో నివసిస్తున్న వడ్డి గురుమూర్తి, మేనక కుమార్తె గీత(16) పదో తరగతి చదువుతోంది. ఆదివారం ఉదయం తల్లిదండ్రులు బయటకు వెళ్లి మధ్యాహ్నం వచ్చేసరికి గీత ఇంటిలో లేదు. ఇంట్లో గీత దుస్తులు, ఓ మొబైల్ ఫోన్ లేకపోవడంతో అనుమానం వచ్చి బంధువులు, స్నేహితులను ఆరా తీశారు. ఫలితం లేకపోవడంతో సాయంత్రం పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో బాలిక తల్లి మేనక ఫిర్యాదు చేసింది. సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ విజయ్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ బూడిదను తరలించే లారీ యాజమాన్యాలు నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు హెచ్చరించారు. ఎన్టీపీసీ బూడిద చెరువుల నుంచి బూడిదను తరలించే లారీలను సీఐ ఆదివారం తనిఖీ చేశారు. బూడిద చెరువులు, ఎన్టీపీసీ నుంచి తడి, పొడి బూడిదను తరలించే వాహనాల నుంచి బూడిద రోడ్లపై పడకుండా పటిష్ఠంగా తార్పాలిన్లు కట్టాలన్నారు. ఓవర్ లోడ్‌తో ప్రయాణించే వాహనాలను గుర్తించి కేసులు నమోదు చేస్తామన్నారు. రాత్రి సమయంలో ఎన్టీపీసీ కారిడార్ రోడ్డు నుంచి దేశపాత్రునిపాలెం, గొర్లివానిపాలెం, పరవాడ, లంకెలపాలెం మీదుగా రాకపోకలు సాగిస్తున్న బూడిద లారీలను గుర్తించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆదివారం జరిపిన తనిఖీల్లో నిబంధనలు అతిక్రమించిన లారీలపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.



తమ బడ్డీ తొలగించొద్దంటూ విరాట్‌నగర్‌లో కన్నీటిపర్యంతమైన మహిళ



పాత అడవివరం రహదారిలో చిరువ్యాపారులు ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక దుకాణం



తొలగింపుల్లో పాల్గొన్న సచివాలయ సిబ్బంది

చిరు వ్యాపారులపై.. కన్నెర్ర కూటమి ప్రభుత్వం

- బడ్డీలు, తోపుడుబళ్లు, తాత్కాలిక దుకాణాల తొలగింపు
- జీవనాధారం కోల్పోయిన చిరు వ్యాపారులు
- ముందస్తు సమాచారం లేకుండా తొలగింపులతో తీవ్ర నష్టం



గోశాల జంక్షన్‌లో నేలమట్టమైన టిఫిన్ దుకాణం

సింహాచలం: రెక్కాడితే కానీ డొక్కాడని చిరు వ్యాపారులపై కూటమి ప్రభుత్వం కక్ష కట్టినట్టు వ్యవహరిస్తోంది. వారి కడుపులు కొడుతోంది. రోజంతా చమటోడ్చి కుటుంబాన్ని పోషించుకునే వారి పరిస్థితిని దుర్భరంగా మారుస్తోంది. గోపాలపట్నం పెట్రోల్ బంక్ నుంచి గోశాల వరకు ఉన్న ప్రధాన రోడ్డు మార్గం, గోశాల జంకన్ నుంచి పాత అడవి వరం వరకు ఉన్న బీఆర్‌టీఎస్ రహదారి పక్కన తాత్కాలిక బడ్డీలు, దుకాణాలు, తోపుడు బళ్లు ఏర్పాటు చేసుకుని చిరువ్యాపారులు జీవిస్తున్నారు. రోజంతా కష్టపడి కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వారి బడ్డీలను, తాత్కాలిక దుకాణాలను జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది గడిచిన రెండు రోజులుగా తొలగిస్తున్నారు. పొక్లెనర్‌తో వచ్చి భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. కొన్నిచోట్ల ఇష్టానుసారంగా బడ్డీలను, తాత్కాలిక దుకాణాలను నేలమట్టం చేశారు. తమ జీవనాధారానికి గండి కొట్టొద్దని వ్యాపారులు కాళ్లావేళ్లా పడినా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో అధికారులకు ఎదురు తిరిగే ధైర్యం లేక వారంతా మిన్నకుండిపోతున్నారు. అప్పులు చేసి తయారు చేసుకున్న బడ్డీలు, దుకాణాలు, తోపుడుబళ్లు నేలమట్టం అవుతుంటే కన్నీటిపర్యంతమవుతున్నారు. ఓట్లు వేసి గెలిపించిన కూటమి ప్రభుత్వం తమకు మంచి మేలే చేసిందని బహిరంగంగానే కన్నీళ్లతో చెప్పుకుంటున్నారు. తమ కడుపులు కొట్టి తమకు తగిన శాస్తే చేశారంటూ పలువురు మహిళలు దుయ్యబడుతున్నారు.



సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా బడ్డీ తొలగిస్తున్న దృశ్యం



బడ్డీని వ్యానుపై తరలిస్తున్న దృశ్యం

చాలా దుర్మార్గం..



మేము రోడ్డు పక్కన కర్రలతో ఏర్పాటు చేసుకున్న చిన్నపాటి షెడ్‌లో ఉదయం నుంచి సాయత్రం వరకు సీతాఫలాలు విక్రయిస్తాం. దాన్ని అర్థంతరంగా తొలగించారు. ఇప్పుడు మా వ్యాపారం ఎలా సాగాలి. కనీసం జీవీఎంసీ అధికారులు కనికరం చూపలేదు. మేము ఎలాంటి ఆక్రమణలకి పాల్పడలేదు. ఇది చాలా దుర్మార్గం.

– సోమునాయుడు, అడవివరం

భయభ్రాంతులకు గురి చేస్తున్నారు



మాకు అడవివరం బీఆర్‌టీఎస్ రోడ్డులో రోడ్డు పక్కనే పర్మినెంట్ షాపు ఉంది. నీడ కోసం షాపు ముందు చిన్నపాటి రేకులతో షెడ్డు వేశాను. జీవీఎంసీ సిబ్బంది వచ్చి ఆ షెడ్ తొలగించాలని భయభ్రాంతులకు గురి చేశారు. అసలు రేకుల షెడ్ వల్ల బీఆర్‌టీఎస్ రోడ్డులో రాకపోకలకి ఎలాంటి అడ్డంకీ కాదు. అయినా వినకుండా తొలగించాలంటూ విరుచుకుపడ్డారు.

– పైడిరాజు, పాత అడవివరం

చంద్రబాబు, లోకేష్, పవన్ సమాధానం చెప్పాలి..



మా అబ్బాయి దివ్యాంగుడు కావడంతో ముద్ర లోన్ తీసుకుని విరాట్‌నగర్‌లో రిమోట్ల షాపు పెట్టుకుని జీవిస్తున్నాం. జీవీఎంసీకి పన్ను కూడా కడుతున్నాం. దాన్ని అర్థంతరంగా తొలగించారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేష్ మాకు పరిష్కారం చూపించాలి. లేదంటే నేను తనువు చాలిస్తా. ఒక్క కార్పొరేటర్ గాని, ఎమ్మెల్యే కాని పట్టించుకోవడం లేదు. – వసుంధర, విరాట్ నగర్

వెంటనే తొలగింపులు ఆపాలి



చిరు వ్యాపారాలు చేసుకుని జీవనం సాగిస్తున్న వారిపై స్మార్ట్ సిటీ పేరుతో జీవీఎంసీ చేస్తున్న దాడులను వెంటనే ఆపాలి. సచివాలయ సిబ్బంది పోలీసుల సహాయంతో తొలగింపులకు దిగడం దారుణం. ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా చిరువ్యాపారాలపై జులుం ప్రదర్శించడం అన్యాయం. తమకేమీ సంబంధం లేనట్టు జీవీఎంసీ వ్యవహరిస్తోంది. – ముద్దాడ ప్రసాద్, సిటు గోపాలపట్నం జోన్ ఉపాధ్యక్షుడు

నేరస్తులను పట్టుకోవడంలో ఏఐ పాత్ర కీలకం



ఏఐపై శిక్షణ అందిస్తున్న రామకృష్ణ

పెందుర్తి : నేరస్తులను పట్టుకోవడంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కీలక పాత్ర పోషించనుందని ఏఐ నిపుణుడు, రాంపురం గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ కుమిలి రామకృష్ణ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏఐపై పోలీసులకు ఆదివారం సాయంత్రం ప్రత్యేక అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాల నియంత్రణలో ఏఐ టూల్స్ వినియోగం వల్ల సత్ఫలితాలు వస్తాయన్నారు. డీప్ ఫేక్, ఫిషింగ్ స్కాం, సోషల్ మీడియా అనాలసిస్, వాయిస్ రికగ్నిషన్ వంటి అంశాలపై అవగాహన కలిగించారు. పోలీసుల సందేహాలను నివృత్తి చేశారు. లా అండ్ ఆర్డర్, క్రైం, ట్రాఫిక్ విభాగాల పోలీసులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రౌడీషీటర్ల తీరు మారకుంటే పీడీయాక్ట్



కౌన్సెలింగ్ చేస్తున్న ఎస్ఐ దేముడుబాబు

పెందుర్తి : రౌడీషీటర్లు మంచిగా ప్రవర్తిస్తే వారి భవిష్యత్ బాగు చేసుకునే అవకాశం కల్పిస్తామని ఎస్ఐ దేముడుబాబు అన్నారు. సర్కిల్ పరిధిలోని రౌడీషీటర్లపై నిరంతర నిఘా ఉంచుతున్నామన్నారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ దేముడుబాబు మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే జైలు పాలు కావాల్సి వస్తుందని రౌడీ షీటర్లను హెచ్చరించారు. చెడు ప్రవర్తన వల్ల కుటుంబాలను సమాజంలో చిన్న చూపు చూస్తారన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినట్లు పోలీసుల దృష్టికి వస్తే పీడీ యాక్ట్ ప్రయోగించడానికి వెనుకాడబోమని స్పష్టం చేశారు. మంచి నడవడికతో ఉంటే రౌడీషీట్‌లు ఎత్తివేయడానికి ఉన్నతాధికారులు ఆలోచిస్తారని వివరించారు. ఎస్ఐ విజయ్‌కుమార్, ఏఎస్ఐ కాశీ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

300 మందికి ఉచిత వైద్య పరీక్షలు



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సింహాచలం : అడవివరంలోని గోశాల కూడలిలో ఎస్‌వీఎల్ఎన్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించిన శిబిరంలో 300 మందికి వైద్య పరిక్షలు చేశారు. వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ ద్వారకానాథ్, గోపాలపట్నం ట్రాఫిక్ సీఐ సురేష్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కేజీహెచ్ కార్డియాలజిస్టు డాక్టర్ హని గొడ్డేటి, విమ్స్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ ఎస్.పైడిశ్రీ,, ఆంకాలజిస్ట్ డాక్టర్ దివ్య సౌజన్య, జనరల్ ఫిజీషియన్లు డాక్టర్ ఎస్.రమేష్, డాక్టర్ ఎస్.ప్రశాంత్‌కుమార్, డెంటిస్ట్ డాక్టర్ గౌతమ్‌సాయి, ఆప్తమాలజిస్టు డాక్టర్ సబీన వైద్య సేవలు అందించారు. అలాగే మధు ల్యాబ్, ఒమేగా హాస్పిటల్, అపోలో, మ్యాక్స్ విజన్ వైద్య బృందం బీపీ, సుగర్, లిపిడ్ ప్రొఫైల్, ఈసీజీ తదితర పరీక్షలు నిర్వహించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు టి.మురళి, ఉపాధ్యక్షుడు బి.సత్యనారాయణ, సెక్రటరీ బి.నరసింగరావు, మాజీ అధ్యక్షుడు గొర్లె నాగార్జున, అడ్వైజర్లు ఎస్. రామకృష్ణ, రాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు. వాకర్స్ అంతా ఆర్థిక సహాయంతో మందులు ఉచితంగా అందజేశారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



స్వర్ణ పుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు, ఆలయ అధికారులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన సేవ విశేషంగా నిర్వహించారు. ముందుగా ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామి వారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తరంపూజ చేశారు. ఉభయదాతలకు శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అలయ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి నిత్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామి వారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి బోల్తా పడిన లారీ



మండల కాంప్లెక్సు సమీపంలో బోల్తా పడిన లారీ

పరవాడ: లంకెలపాలెం-పరవాడ రహదారిలో మండల కాంప్లెక్స్‌సమీపంలో ఆదివారం తెల్లవారు జామున ఓ బూడిద లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో అచ్యుతాపురం ప్రాంతానికి చెందిన లారీ క్లీనర్ నరమల వంశీ గాయపడ్డాడు. అతన్ని చికిత్స నిమిత్తం నగరంలోని కేజీహెచ్‌కు తరలించారు. లారీ డ్రైవర్ సంతోష్ ప్రమాదం నుంచి క్షేమంగా బయటపడ్డాడు. ఎన్టీపీసీ నుంచి బూడిదను లోడు చేసుకుని ఘాట్ రోడ్డుకు వెళ్లడానికి బయలుదేరిన బూడిద లారీ పరవాడ మండల కాంప్లెక్సు వద్దకు రాగానే వేకువ జాము 3 గంటల సమయంలో డ్రైవర్ నిద్ర మత్తు వల్ల రోడ్డు పక్క విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి బోల్తా పడింది. గాయపడిన క్లీనర్ పరిస్థితి గురించి ఆందోళన అవసరం లేదని పరవాడ పోలీసులు చెప్పారు. బోల్తా పడిన లారీని సోమవారం తొలగించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. పరవాడ పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

వర్ధమాన నటుడు పైడిరాజుకు అభినందన



పైడిరాజును సత్కరిస్తున్న అతిథులు

మల్కాపురం: మనసు అనే లఘు చిత్రం ప్రీమియర్ షో ఆదివారం స్థానిక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా రైటర్స్ అకాడమీ అధ్యక్షుడు వీవీ రమణమూర్తి, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ ఆ చిత్రంలో పావురాలు పట్టే క్యారెక్టర్ చేసిన మల్కాపురం వాసి పైడిరాజును సత్కరించారు. అలాగే చిత్ర దర్శకుడు పైడి శంకర రావును అభినందించారు.

నేటి నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



పెందుర్తిలో మహాకామేశ్వరి అమ్మవారు



అయ్యప్ప దేవాలయ ప్రాంగణంలో కనకదుర్గమ్మ



సప్తగిరినగర్‌లో అలివేలు మంగమ్మ



శ్రమశక్తినగర్‌లో పంచముఖ గాయిత్రి మాత



ఎస్ఆర్ పురంలో కనకదుర్గమ్మ

- సుందరంగా ముస్తాబైన అమ్మవార్ల దేవాలయాలు

పెందుర్తి : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు నియోజకవర్గం ముస్తాబైంది. పెందుర్తి ప్రాంతంలో సోమవారం నుంచి ఉత్సవాల కోసం పీఠాలు, ఆలయాలు, మండపాలు సిద్ధమయ్యాయి. ఉత్సవాలు దసరా సందర్భంగా అక్టోబర్ 2న ముగుస్తాయని ఆయా ఆలయాల ప్రతినిధులు వెల్లడించారు. పెందుర్తిలోని మహాకామేశ్వరీ సహిత ద్వాదశ జ్యోతిర్లింగాలయాల సముదాయంలో సోమవారం నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రతినిధి డి.వై.చైనులు తెలిపారు. తొలి రోజు అమ్మవారు రజత కవచ అలంకారం, 23న బాలత్రిపుర సుందరిదేవిగా, 24న గాయిత్రిమాతగా, 25న అన్నపూర్ణాదేవిగా, 26న మహాకామేశ్వరిగా, 27న లలితాత్రిపురసుందరిదేవిగా, 28న మహాలక్ష్మిగా, 29న సరస్వతిదేవిగా, 30న దుర్గాదేవిగా, అక్టోబర్ 1న మహిషాసురమర్ధినిగా, 2న రాజరాజేశ్వరి అలంకారంలో దర్శనమిస్తారన్నారు. రోజూ ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన ఉంటుందన్నారు. భక్తులంతా పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

- చినముషిడివాడ సమీపంలోని సప్తగిరినగర్‌లోని అలివేలు మంగమ్మ సన్నిధిలో వీరలక్ష్మి ఆరాధన, శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. వేడుకల కోసం దేవాలయం సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఉత్సవాల్లో భాగంగా రోజూ బొమ్మల కొలువు ఉంటుందని, 26న సామూహిక కుంకుమార్చన నిర్వహిస్తామని వెల్లడించారు. ముగింపు సందర్భంగా పేద మహిళలకు ఉచితంగా చీరలు పంపిణీ చేస్తామని తెలిపారు.
- శ్రమశక్తినగర్‌లోని పంచముఖ గాయిత్రి ఆలయంలో ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ధర్మకర్త సరస్వతుల నరసింహమూర్తి చెప్పారు. ఎస్ఆర్ పురంలోని కనకదుర్గమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు గ్రామంలో 108 కలశాలతో ఊరేగింపు నిర్వహిస్తామని తెలిపారు. భవానీ మాల ధరించే వారికి రోజూ ఆలయంలో బిక్ష ఏర్పాటు చేస్తున్నామన్నారు.
- సుజాతనగర్‌లోని అయ్యప్పస్వామి దేవాలయ ప్రాంగణంలో కొలువుదీరిన కనకదుర్గమ్మ సన్నిధిలో శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ దర్మకర్త వాకా చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

దేవీపురంలో దసరా బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు



దేవీపురంలోని శ్రీచక్రాలయం

నబ్బువరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని శ్రీసహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి ఆరాధన పీఠంలో దసరా బ్రహ్మోత్సవాలను ఈ నెల 22 నుండి వచ్చే నెల 7వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు గురుమాత అన్నపూర్ణమ్మ ఆదివారం ఒక ప్రకటకనలో తెలిపారు. ఉత్సవాలలో భాగంగా ప్రతిరోజు క్షీరాభిషేకం, కుంకుమార్చన, హోమం, మంత్ర జపం, పారాయణలు, కళావాహన పూజలతో పాటు అలంకార సేవ, అన్నదాన సేవా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ప్రతిరోజు దుర్గా సప్తశతి, లలితా సహస్ర నామావళి, ఖడ్గాది పంచదశ మాల-తిథి వారీగా స్తోత్ర పారాయణలు జరుగుతాయన్నారు. వచ్చే నెల 7న పౌర్ణమిని పురస్కరించుకుని సహస్రాక్షి దేవి అభిషేకం, దేవీ కల్యాణోత్సవం, ప్రతి రోజు ప్రత్యేక హోమాలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం



భూలోకమాంబ



ఉమాదేవి అమ్మవారు

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు పరిధిలోని పలు ఆలయాలు, వాడవాడలా దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు. విజినిగిరిపాలెంలో ఉన్న ఉమాదేవి ఆలయాలో ఉమాదేవి రోజుకో అలంకారంలో దర్శనం ఉంటుందని ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణ శర్మ తెలిపారు. భక్తులంతా ఈపూజల్లో పాల్గొని తరించాల్సిందిగా కోరారు.

భూలోకమాంబ ఆలయంలో....

98వ వార్డు పరిధి అప్పన్నపాలెంలో కొలువుదీరిన భూలోకమాంబ ఆలయంలో సోమవారం నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అలాగే అడవివరంలోని ఆయిల్‌మిల్ వద్ద శ్రీగణేష్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. గాంధీనగర్‌లో హనుమాన్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు. సింహపురికాలనీ ఆర్చి వద్ద స్థానిక ఆటో స్టాండ్ డ్రైవర్ల ఆధర్యంలో ఏర్పాట్లు చేశారు.